
ప్రజాశక్తి
బుధవారం 25 అక్టోబర్ 2023
5
కర్నూలు



దసరా దోపిడీ

- ఇష్టారాజ్యంగా ప్రయివేటు బస్సు ఛార్జీలు
- ఖాళీ అవుతున్న సామాన్యుల జేబులు
- ఛార్జీల నియంత్రణలో అధికారుల విఫలం



ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

పండుగ సీజన్ వచ్చిందంటే ప్రయివేటు ఆపరేటర్లు వసూళ్ల పండగ చేసుకుంటున్నారు. ఇష్టానుసారంగా బస్సుల ఛార్జీలను పెంచేసి ప్రయాణికులను నిలువు దోపిడీ చేసేస్తున్నారు. రద్దీకి అనుగుణంగా ఛార్జీలను బాదేస్తున్నారు. దసరా సెలవులు రావడంతో ప్రయివేటు బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు పర్సు ఖాళీ కాక తప్పడం లేదు...

పండుగ సీజన్‌లో ప్రయాణికుల నుంచి ఏర్పడిన డిమాండ్‌నే ప్రయివేటు ట్రావెల్స్ సొమ్ము చేసుకుంటున్నాయి. బస్సు రూటుతో పని లేకుండా చార్జీలను రెట్టింపు చేసేసారు. అదనపు ఛార్జీలు వసూలు చేయకుండా ఛార్జీలను నియంత్రించాల్సిన రవాణా శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న బహిరంగ విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆర్టీసీలోని సూపర్ లగ్జరీ బస్సుల్లో కర్నూలు నుంచి హైదరాబాద్‌కు రూ.350 ఉండగా అదే మార్గంలో ప్రయివేటులో నాన్ ఎసి సీటర్‌లో రూ.1500 వరకూ, ఎసి సీటర్‌లో రూ.1200 నుంచి రూ.2111, నాన్ ఎసి స్లీపర్‌లో అయితే రూ.900 నుంచి రూ.2వేల వరకూ, ఎసి స్లీపర్‌లో రూ.1749 నుంచి రూ.3399 వరకూ వసూలు చేస్తున్నారు. పండుగ సెలవులు ముగియడంతో కర్నూలు నుంచి హైదరాబాద్ నుంచి వెళ్లే వారి సంఖ్య ఎక్కువ ఉండటంతో ఆ రూట్‌లో ప్రయివేటు ట్రావెల్స్ అధిక మొత్తంలో దండుకుంటున్నాయి. హైదరాబాద్ నుంచి నంద్యాలకు ఎపిఎస్ఆర్‌టిసిలో రూ.490 ఉండగా అదే మార్గంలో ప్రయివేటులో నాన్ ఎసి సీటర్‌లో రూ.600 నుంచి రూ.1290 వరకూ, ఎసి సీటర్‌లో రూ.850 నుంచి రూ.2590, నాన్ ఎసి స్లీపర్‌లో అయితే రూ.1400 నుంచి రూ.3వేల వరకూ, ఎసి స్లీపర్‌లో రూ.1100 నుంచి రూ.2990 వరకూ వసూలు చేస్తున్నారు. కర్నూలు నుంచి విజయవాడకు ఆర్టీసి సూపర్ లగ్జరీలో రూ.512 ఛార్జీ ఉండగా ప్రయివేటులో సీటర్‌లో రూ.858 వరకూ వసూలు చేస్తున్నారు. అదే మార్గంలో ఆర్టీసి స్లీపర్‌లో రూ.870 ఉండగా ప్రయివేటులో రూ.990 నుంచి రూ.1130 వరకూ ఉంది. విజయవాడ నుంచి కర్నూలుకు స్లీపర్‌లో రూ.800 నుంచి రూ.1090 వరకూ వసూలు చేస్తున్నారు.

బ్లాక్‌లోనూ టికెట్లు

పండగ సీజన్‌లో ఊరికెళ్లేందుకు ప్రయాణికులు సీట్ల కోసం నానా తంటాలు పడాల్సి వస్తోంది. వారం రోజుల ముందు నుంచే ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకునేందుకు ప్రయత్నాలు మొదలెట్టినా సీట్లు లభించడం లేదు. ఆయా ప్రయివేట్ ట్రావెల్స్ ఆపరేటర్లు ముందుగా టికెట్లను బుక్ చేసేసి ప్రయాణికుల నుంచి వచ్చే డిమాండును బట్టి బ్లాక్‌లో అధిక ధరలకు విక్రయించుకుంటున్నారన్న వార్తలూ వినిపిస్తున్నాయి.

జిల్లా సరిహద్దు చెక్ పోస్టులో ప్రత్యేక నిఘా

పంచలింగాల చెక్ పోస్టును ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్‌పి



అధికారులకు సూచనలు ఇస్తున్న ఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ – తెలంగాణ రాష్ట్ర సరిహద్దు దగ్గర ఉన్న కర్నూలు జిల్లా, పంచలింగాల చెక్ పోస్టును జిల్లా ఎస్‌పి జి.కృష్ణకాంత్ సోమవారం ఆకస్మిక తనిఖీ చేసి పరిశీలించారు. తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఆంధ్ర ,తెలంగాణ బార్డర్ చెక్ పోస్టులలో ఓటర్లను ప్రభావితం చేసే నగదు , మద్యం, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలకు అనుమతులు లేకుండా సరఫరా చేసే ఇతర వస్తువులు అక్రమ రవాణా జరగకుండా గట్టి చర్యలు చేపట్టాలన్నారు. చెక్ పోస్టులో విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్‌పి ఆదేశించారు. ఎస్‌పి వెంట స్పెషల్ బ్రాంచ్ సిఐలు ప్రసాద్, శ్రీనివాసరెడ్డి, కర్నూలు తాలుకా సిఐ శ్రీరామ్, ఎస్ఐలు, సెబ్ పోలీసులు ఉన్నారు.

మైనర్లకు ద్విచక్ర వాహనాలను ఇవ్వొద్దు

కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి కర్నూలు క్రైమ్

కర్నూలు నగరంలో మైనర్లు బైక్‌ను నడిపేందుకు తల్లిదండ్రులు పిల్లలకు బైకులు ఇవ్వద్దని కర్నూలు ఎమ్మెల్యే ఎం.ఎ.హాఫీజ్ ఖాన్ సూచించారు. వాటిని అదుపు చేయకపోవడంతో చాలా మంది యువత ప్రమాదానికి గురవుతున్నారని అన్నారు. నగరంలోని ట్రాఫిక్ పోలీసులు వారు యువతకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, చిన్న పిల్లలకు వాహనాలను ఇవ్వకుండా వారి భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు ఆలోచించాలని కోరారు. ప్రతిరోజు మైనర్ డ్రైవింగ్ పిల్లలకు సంబందించి పోలీసులు పట్టుకొని అధికమైన చలాన్లు విధిస్తున్న సందర్భంగా తనకు ఎన్నో కాల్స్ వస్తున్నాయని అన్నారు. చాలా కుటుంబాల ఆర్థిక పరిస్థితి బాలేదని, ఈ విషయం దృష్టిలో పెట్టుకుని అధిక చలాన్లు వేయవద్దని పోలీసులకు విన్నవించారు. అధికమైన ఫైన్స్ లేకుండా మైనర్ డ్రైవింగ్ నిబంధనలను ఉల్లంగించిన వాళ్లకు మొదట కౌన్సిల్ ఇవ్వాలని ట్రాఫిక్ డిఎస్‌పి, ఆర్‌టిఒ, ఎస్‌పిని ఎమ్మెల్యే కోరారు.

కాంగ్రెస్ బలపడేనా?

- పార్టీ బలోపేతానికి పిసిసి ప్రత్యేక కృష్టి
- డిసిసి అధ్యక్షుడి మార్పుతో చర్యలు

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజనతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ప్రజల ఆదరణ కోల్పోయింది. కాంగ్రెస్ పార్టీ విభజనకు పూనుకోవడం పట్ల ఆ పార్టీని దూరం పెట్టారు. ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి అధిష్టానం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా డిసిసి అధ్యక్షుడు మార్పుతో కర్నూలు జిల్లాలో కొత్తమార్పువసుందని భావిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కర్నూలు జిల్లా కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉండేది. ప్రస్తుతం అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపిలోకి క్రియాశీలకంగా ఉన్నటువంటి నేతలు ఇక్కడి నుండి వలస వెళ్లారు. 2014 అనంతరం కాంగ్రెస్ పార్టీ తరపున పార్లమెంట్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులకు డిపాజిట్లు కూడా దక్కనటువంటి పరిస్థితి నెలకొంది. అనంతరం కర్నూలు జిల్లాలో కాంగ్రెస్ పార్టీ జెండా మోసే వారే లేరు. 2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీలో కీలకంగా ఉన్న కోట్ల కుటుంబం దూరమైంది. కేంద్ర మాజీ మంత్రిగా పనిచేసిన కోట్ల జయసూర్యప్రకాశ్ రెడ్డి ఆయన సతీమణి కోట్ల సుజాతమ్మ టిడిపిలో చేరారు. కోట్ల కుటుంబం కాంగ్రెస్ పార్టీకి దూరం కావడంతో మరింత చతికిల పడింది. కర్నూలు జిల్లాలో కొంత ప్రభావం చూపే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చారు. అనంతరం ఏడాది కూడా కాంగ్రెస్ లో పని చేయకుండా ఆయన గుడ్‌బై చెప్పేశారు. ప్రస్తుతం జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి పేరుగాంచిన నాయకులు ఎవరు లేరు. గతేడాది సెప్టెంబర్‌లో రాహుల్ గాంధీ నిర్వహించిన భారత్‌జోడో యాత్రకు అపూర్వ స్పందన లభించింది. దేశంలో బిజెపి పట్ల పెరుగుతున్న వ్యతిరేకతతో కాంగ్రెస్ ఇతర ప్రతిపక్ష పార్టీలు కలిపి ఇండియా కూటమిగా ఏర్పడి రాబోయే ఎన్నికల్లోకి వెళ్లాలని నిర్ణయించాయి. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో కాంగ్రెస్‌కు అనుకూలమైన ఓటు బ్యాంకు బలంగానే ఉంది. పార్టీని లీడ్‌చేసే నాయకుడు మాత్రం లేడు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లోగా కాంగ్రెస్‌ను బలోపేతం చేసే దిశగా పిసిసి అధిష్టానం దృష్టి సారించింది. ఇటీవల కాలంలో జిల్లాలో డిసిసి అధ్యక్షుడిగా పని చేస్తున్న సుధాకర్ బాబును రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించింది. మంత్రాలయ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా పనిచేస్తున్న కె.బాబురావును డిసిసి అధ్యక్ష పదవీ బాధ్యతలను కట్టబెట్టింది. దామోదరం సంజీవయ్య కుటుంబం నుండి దామోదరం రాధాకృష్ణకు పిసిసి రాష్ట్ర ఉపాధ్యక్ష పదవిని కట్టబెట్టారు. క్షేత్రస్థాయి వరకు గ్రామాల్లో పార్టీని బలోపేతం చేసే దిశగా అడుగులు వేసేందుకు వ్యూహ రచన చేశారు. ఈనెల 22న పిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, కర్నూలు జిల్లా పర్యటనకు రానున్నారు. ఇందులో భాగంగా మంత్రాలయంలో నిర్వహించే భారత్ జోడో విజయోత్సవ సంబరాల కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు.

నేటి నుండి పాఠశాలలు పునః ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

దసరా సెలవుల అనంతరం పాఠశాలలు బుధవారం నుండి ప్రారంభం కానున్నాయి. ప్రయివేటు ప్రభుత్వ పాఠశాలలన్నింటికీ ఇది వర్తిస్తుందని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట రంగారెడ్డి తెలిపారు. ప్రతి ఉపాధ్యాయుడు పాఠశాలకు హాజరుకావాలని అన్నారు. పాఠశాల కార్యక్రమాలు యదావిధిగా జరుగుతాయన్నారు.

శ్రీశైలంలో ముగిసిన దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి- శ్రీశైలం

శ్రీశైలంలో జరుగుతున్న దసరా నవరాత్రి ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. నందివాహనంపై స్వామి అమ్మవార్లు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా పూజలు, పూర్ణాహుతి స్వామి వారి యాగశాలలో పూర్ణ అధికారి కార్యక్రమాన్ని సంప్రదాయపదంగా రుద్రయాగ పూర్ణాహుతి, కలశోద్వాసన నిర్వహించారు. ఇందులో సుగంధ ద్రవ్యాలు, నారికేలాలు, నూతన వస్త్రాలు ,హోమ గుండంలో సమర్పించారు.

శమీ పూజ: దసరా మహోత్సవాలలో శమీ పూజ ఎంతో ముఖ్యమైనది. ఇందులో నంది వాహనంపై స్వామి అమ్మవార్లను శమీ వృక్షం వద్దకు తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తెప్పోత్సవం: దసరా మహోత్సవాలలో తెప్పోత్సవం కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా ఆలయానికి ఈశాన్య భాగంలో ఉన్న పుష్కరిణిలో వివిధ రకాల విద్యుత్ దీపాలంకరణ చేసి , తెప్పకు వివిధ రకాల పూలతో అలంకరించి ఉంచి, స్వామి అమ్మ వార్లను ఆలయ ప్రాంగణం నుండి పల్లకీలో పుష్కరం వద్దకు తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తెప్పోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్థానికులు అధికారులు పాల్గొన్నారు. పూర్ణాహుతితో పూజాకార్యక్రమాలకు మంగళహారతి పలికి ముగించారు.

రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు

108 ద్వారా ఆసుపత్రికి తరలింపు

ప్రజాశక్తి -తుగ్గలి

తుగ్గలి మండలం జొన్నగిరి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యారు. గాయాలకు గురైన వారిని 108 సహాయంతో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మంగళవారం సాయంత్రం గుత్తి నుంచి పత్తికొండకు వెళుతున్న ఆటో ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి అదుపుతప్పి ఆటో లారీ రెండు పడిపోయాయి. అందులో ఉన్న ప్రయాణికులు ఆరుగురికి, లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గాయాలకు గురైన వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి తీవ్ర ఆందోళనకరంగా ఉందని స్థానికులు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది.

క్షతగాత్రులను అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న దృశ్యం



రోడ్డు ప్రమాదంలో సచివాలయ గృహ సారధి మృతి

ప్రజాశక్తి-తుగ్గలి



తుగ్గలి మండలం పెండేకల్ గ్రామానికి చెందిన ఎంపిటిసి గిరిపోగుల పెద్ద రంగన్న సతీమణి, వైసిపి సచివాలయ గృహ సారథి గిరిపోగుల ప్రమీలమ్మ (55) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈనెల 17న ఎంపిటిసి గిరిపోగుల పెద్ద రంగన్న, ఆయన భార్య సచివాలయ గృహ సారధి గిరిపోగుల ప్రమీలమ్మ ద్విచక్ర వాహనంపై వస్తుండగా నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం ఎన్ రంగాపురం వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో గాయపడిన గిరిపోగుల ప్రమీల కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ఆమె కోలుకోలేక మృతి చెందారు. ఈ విషయం పై ఎమ్మెల్యే సంతాపం వ్యక్తం చేసారు. ఎంపిటిసి పెద్ద రంగన్న కుటుంబానికి పార్టీ నుండి రూ.10 లక్షలు బీమా వచ్చే విధంగా కృషి చేయాలని ఎమ్మెల్యే శ్రీదేవిని కోరినట్లు సచివాలయం కన్వీనర్ బసిరెడ్డి తెలిపారు. ఆమె మృతి పట్ల సొసైటీ చైర్మన్ గోపాల్ రెడ్డి, సర్పంచి లీలావతి, సచివాలయం మండల కన్వీనర్ హనుమంతు, మండల కమిటీ అధ్యక్షులు నగేష్ యాదవ్ సంతాపం వ్యక్తం చేశారు.

ఉరేసుకుని గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- వెల్దుర్తి

వెల్దుర్తి గ్రామ శివారులలో శ్రీఎల్లమ్మ గుడి వెనుక వైపు సర్వే నెంబరు 328–1లో గల బెస్త పెద్ద రామాంజనేయులు పొలంలో రేగి చెట్టుకు గుర్తు తెలియని వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని వయసు సుమారుగా 28 నుండి 30 సంవత్సరాల మధ్య ఉండవచ్చు. అతను సుమారు 5.3 అడుగుల ఎత్తు కలిగి ఉన్నాడు. అతని ఒంటిపై సగం ఎర్రని , సగం నలుపు, తెలుపు చారలు గల మొలతాడు తప్ప ఎలాంటి దుస్తులు లేవు. కుడి వైపున ఛాతి కింద ఒక నల్లని పుట్టు మచ్చ, కుడి వైపున పొట్టపై ఒక నల్లని పుట్టుమచ్చ, ఎడమవైపు భుజంపై ఒక నల్లని పుట్టు మచ్చ ఉంది. మృతుడి ఎడమవైపు చాతికింద పాతగీకుడు గాయం ఉంది. మృతుడు రెండు డ్రాయర్లకు సంబంధించిన ఎలాస్టిక్ బెల్టులతో చెట్టుకొమ్మకు , అతని మెడకు కట్టుకొని ఉరి వేసుకున్నట్లు ఉంది. దానిపై క్రీము కలర్ కింద ఎర్రని లైను ఉంది. మరొక ఎలాస్టిక్ బెల్ట్‌ను పరిశీలించగా చెట్టు కింద , చెట్టు పైన ఒక కొమ్మపై అతను తనకు సంబంధించిన దుస్తులను, అతనికి సంబంధించిన ఇతర వస్తువులను కాల్చినట్లుగా అక్కడ బూడిద పడి ఉంది. అతని గొంతు చుట్టూ డ్రాయర్ల ఎలాస్టిక్ బెల్టులతో ఉరి వేసుకోవడం వలన ఏర్పడిన కందుడు గాయాలు ఉన్నాయి. ఇక శరీరంపై ఎక్కడ కూడా ఎలాంటి గాయాలు లేవు. చుట్టుపక్కల ఎంత వెతికినా కూడా అతనికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు గాని అతని వివరాలు గానీ తెలియలేదు. మృతుని వివరాలు తెలిసినవారు వెల్దుర్తి పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఫోన్ నెంబర్ 9121101118 కు సమాచారం ఇవ్వాలన్నారు.


ఐఎన్‌టియుసి ఆధ్వర్యంలో దసరా వేడుకలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఐఎన్‌టియుసి ఆధ్వర్యంలో కర్నూలు రైల్వే స్టేషన్లో దసరా వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా డిసిసి అధ్యక్షుడు కె. బాబురావు పాల్గొని రైల్వేగూడ్ షెడ్లకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు బతకన్న, రైల్వే హమాలీలు కూడా పాల్గొన్నారు.

చంద్రబాబును విడుదల చేయాలి : టిడిపి

వాడవాడలా జగనాసుర దహనం



జగనాసుర అని రాసిన పేపర్లను దహనం చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

చంద్రబాబు నాయుడు అరెస్టును ఖండిస్తూ సైకో పోవాలి సైకిల్ రావాలని, చంద్రబాబు నాయుడును వెంటనే విడుదల చేయాలని నిరసన వ్యక్తం చేశారు. దసరా సందర్భంగా జగనాసుర దహన కార్యక్రమం టిడిపి శ్రేణులు వాడవాడల నిర్వహించారు. కర్నూలు నియోజకవర్గం టిడిపి ఇంచార్జి టిజి.భరత్, కర్నూలు నగర పార్టీ అధ్యక్షులు నాగరాజు యాదవ్ ఆధ్వర్యంలో జిల్లా టిడిపి కార్యాలయం ఎదుట జగనాసుర దహనం కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర టిడిపి ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు హాజరయ్యారు. సైకో పోవాలి సైకిల్ రావాలి అని నినాదాలు చేస్తూ విజయదశమి పర్వదినాన న్యాయం ధర్మం వైపు ప్రతి అడుగు ముఖ్యమని, ఆంధ్రప్రదేశ్‌కు ఉజ్వల భవిష్యత్తును అందించడానికి జగనాసుర దహన కార్యక్రమం నిర్వహించామని టిడిపి నాయకులు తెలిపారు.



టిడిపి ఆధ్వర్యంలో మార్కాపురంలో జగనాసురదహనం

కల్లూరుఅర్బన్ లో : పాణ్యం నియోజకర్గం గౌరు వెంకటరెడ్డి స్వగృహం వద్ద మనం చేద్దాం జగనాసుర దహనం కార్యక్రమం గౌరు చరితారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. **మార్కాపురంలో:** కల్లూరు మండలం కె.మార్కాపురం గ్రామంలో టిడిపి అధ్యక్షులు డి రామాంజనేయులు ఆధ్వర్యంలో రాష్ట్ర పార్టీ ఆదేశానుసారం పాణ్యం ఇన్‌ఛార్జి గౌరు చరితమ్మ ఆదేశాల మేరకు విజయదశమి పండుగ సందర్భంగా మనం చేద్దాం జగనాసుర దహనం కార్యక్రమం నిర్వహించారు. సైకో సిఎం పోవాలి పిచ్చి సీఎం దిగిపోవాలి తుగ్లక్ సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. బాబు అక్రమ అరెస్టును ఖండిస్తూ సైకో పోవాలి సైకిల్ రావాలని చంద్రబాబు నాయుడును వెంటనే విడుదల చేయాలని నిరసన వ్యక్తం చేశారు.

నియంత పాలనకు స్వస్తి పలకాలి

కర్నూలు క్రైమ్ : రాష్ట్రంలో నియంత పాలనకు స్వస్తి పలకాలని కోడుమూరు టిడిపి యువ నాయకులు బొగ్గుల దస్తగిరి అన్నారు. ఆదివారం రాత్రి కర్నూలు మండలం పసుపుల గ్రామంలో చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టిడిపి సీనియర్ నాయకులు డి.విష్ణువర్ధన్ రెడ్డి నేతృత్వంలో సైకో పోవాలని రాసి ఉన్న కాగితాలను మంటల్లో వేసి కాల్చివేశారు. దస్తగిరి మాట్లాడుతూ అభివృద్ధి ప్రదాత అయిన చంద్రబాబును స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అక్రమంగా అరెస్టు చేశారన్నారు.



దస్తగిరి ఆధ్వర్యంలో

జగనాసుర పాలనను అంతమొందిద్దాం : టిడిపి

ప్రజాస్వామ్యానికి ఆటంకంగా మారిన జగనాసురుని పాలనను అంతమొందిద్దామని కోడుమూరు నియోజకవర్గ సర్పంచుల సంఘం అధ్యక్షులు ఆకెపోగు జయన్న అన్నారు. ప్రభుత్వ పాలనను నిరసిస్తూ టిడిపి సీనియర్ నేత బి.విష్ణువర్ధన్ రెడ్డి నేతత్వంలో ఆయన తన కుటుంబ సభ్యులతో పాటు పలువురు టిడిపి కార్యకర్తలతో కోడుమూరు మండలం, బి.తాంద్రపాడులోని తన ఇంటి వద్ద జగనాసురుడు అని రాసి ఉన్న కాగితాలను మంటల్లో కాల్చివేశారు.



బి.తాంద్రపాడులో సర్పంచి జయన్న ఆధ్వర్యంలో

కుల వివక్షతో దళితుడి బలవన్మరణం

-కారకులను అరెస్టు చేసి శిక్షించాలి
-ఒపిడిఆర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు

ప్రజాశక్తి -కర్నూలు హాస్పిటల్

అగ్రకుల అహంకారంతో ఉద్దేశపూర్వకంగా మాదిగ శ్రీనివాసులును మానసికంగా హింసించి ఆత్మహత్యకు కారకులైన నిందితులు తుడుములదిన్నె గ్రామానికి చెందిన పెత్తందారులు పేరెడ్డి మోహన్ రెడ్డి, కర్నాటి శేఖర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డిలను కఠినంగా శిక్షించాలని ఒపిడిఆర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి.కరుణాకర్‌రావు, జిఎల్.నరసింహుడు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వారు తెలిపిన సంఘటన వివరాలు... ఈ నెల15న సాయంత్రం 4:00 గంటల సమయంలో ఉయ్యాలవాడ మండలం, తుడుములదిన్నె గ్రామానికి చెందిన శివవరం మాదిగ శ్రీనివాసులు మేకలు మేపుకుంటుండగా అదే గ్రామానికి చెందిన నందవరపు గోపాల్ రెడ్డి అతని తమ్ముడు మధుసూదన్ రెడ్డి ఇద్దరూ కలసి శ్రీనివాసులుతో వారి పొలం దగ్గర మేకలు మేపుకోవద్దని బెదిరించారు. శ్రీనివాసులు మేకలు వంకలో మేపుకుంటే మీకు నష్టమేమి అన్నందుకు వారు మాదిగ నాకొడకా మాకే ఎదురు చెపుతావా అని శ్రీనివాసులును కర్రతోకొట్టి, కింద పడేసి కాళ్ళతో తన్నుతుండగా శ్రీనివాసులు భార్య, చుట్టుప్రక్కల వారు వచ్చి విడిపించారు. ఎం.శ్రీనివాసులు గోపాల్ రెడ్డి మీద, మధుసూదన్ రెడ్డి మీద ఉయ్యాలవాడ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు వారి మీద కేసు నమోదు చేశారు. కేసు నమోదు కావడం భరించలేని తుడుములదిన్నె గ్రామానికి చెందిన అగ్రకుల పెత్తందారులు పేరెడ్డి మోహన్ రెడ్డి, కర్నాటి శేఖర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి శనివారం రాత్రి శ్రీనివాసులును, అతని భార్యను మోహన్ రెడ్డి ఇంటి దగ్గరకు పిలిపించుకొని ' కేసు వాపసు తీసుకోండి లేకుంటే మీరు ఊర్లో ఉండలేరు. మీ అంతు చూస్తాం, మాకు రాజకీయ పలుకుబడి ఉంది' అని బెదిరించారు. శ్రీనివాసులు వారికి భయపడి మనస్తాపం చెంది ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనను ఒపిడిఆర్ కర్నూలు జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తోందని, ఘటనకు కారకులైన వారికి కఠిన శిక్ష పడేలా పోలీస్ డిపార్టుమెంట్ చర్యలు చేపట్టాలని కోరారు. శ్రీనివాసులు మృతికి కారకులైన పెత్తందారుల నుంచి శ్రీనివాసులు కుటుంబానికి పోలీసు రక్షణ కల్పించాలని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం నష్ట పరిహారం ఇప్పించాలని , కుటుంబ పెద్దను కోల్పోయిన ఆ కుటుంబాన్ని అన్ని రకాలుగా ఆదుకోవాలని ఒపిడిఆర్ నాయకులు డిమాండ్ చేశారు.

సింగవరంలో మురుగుతో ప్రజల అగచాట్లు

ప్రజాశక్తి-సి బెళగల్

సి బెళగల్ మండలం సింగవరంలో సిసి రోడ్లు ఉన్నా మురుగు కాల్వలు లేక అగచాట్లు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలో 16 వీధులుండగా అందులో నాలుగు వీధులకు మాత్రమే మురుగు కాల్వలు ఉన్నాయి. మిగిలిన తెలుగు వీధి, కురువ, ఎస్‌సి కాలనీలలో మురుగు రోడ్లపైనే ప్రవహిస్తోంది. కొన్ని వీధులలో సిసి రోడ్డుకిరువైపులా మురుగు నిలిచి కదలని పరిస్థితి. మరికొన్ని వీధుల్లో మురుగు కాల్వలు వేసేందుకు వీలుగా లేకుండా అక్రమణలకు గురైంది. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ఉన్నతాధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి: లక్ష్మి స్థానికురాలు



మా వీధిలో సిసి రోడ్లు ఉన్నా మురుగు కాల్వలు లేక, ముందుకు కదలక దుర్గంధం వస్తోంది. కనీసం బ్లీచింగ్ పౌడర్ వేసే వాళ్ళు లేరని పరిష్కరించాలని అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదు. చీకటి పడితే విషదోమలు ఇళ్లలోకి చేరి అతులాకుతలం చేస్తున్నాయి. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రభలకుండా ఎలాంటి చర్యలు చేపట్టక పోవడం శోచనీయం.

మురుగు కాల్వలు నిర్మించాలి: రామాంజినేయులు - స్థానికులు



మురుగు కాల్వలు వేసి సిసిరోడ్లు వేస్తేనే ప్రజలకు మేలు జరుగుతోంది. మురుగు ఎటూ వెళ్లాలో, ఇళ నిర్మాణం ఎంత వరకు చేపట్టాలో ప్రణాళిక వస్తుంది. సిసి రోడ్లు నిబంధనలను పాటించని కారణంగా మురుగు సమస్య వీధుల్లో వివాదాలకు తలెత్తుతున్నాయి.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-మద్దికేర

మద్దికేర మండల కేంద్రంలోని ఎస్‌సి కాలనీ గ్రౌండ్లో సోమవారం ఎంపిఎల్ క్రికెట్ టోర్నమెంటును ప్రారంభిస్తున్నట్లు ఎపిఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు పారా రాఘవేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలైన ఎస్‌సి కమ్యూనిటీ యువత చదువుతోపాటు క్రీడల్లో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. చదువుతున్న యువతకు ప్రోత్సాహం ఇస్తూ ప్రతి సంవత్సరం క్రికెట్ టోర్నమెంటును ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు క్రికెట్ క్రీడాకారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దేవిశెట్టి ప్రకాష్

ఆదోని డివిజన్‌ను కరువు ప్రాంతంగా గుర్తించాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని డివిజన్‌ను కరువు ప్రాంతంగా గుర్తించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జ్ దేవిశెట్టి ప్రకాష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆదోని పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎప్పుడులేని విధంగా కరువు పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎకరాకు రూ.లక్ష పెట్టుబడి పెడితే రూ.10 వేలు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. రైతులకు తీవ్ర నష్టం రావడంతో రైతు, కూలీలు కుటుంబాలతో సహా సూదూర ప్రాంతాలకు వలస వెళుతున్నా రన్నారు. ఇటీవల ఎమ్మిగనూరు పట్టణానికి వచ్చిన ముఖ్యమంత్రి రైతుల గురించి మాట్లాడకపోవడం విచారకరమన్నారు. ఎకరాకు రూ.లక్ష పంట నష్టపరిహారం ఇవ్వాలని, లేనియెడల రైతులను సమీకరించి సబ్ కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండినూర్, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బి.తాయన్న, ఐఎన్టియుసి ఉపాధ్యక్షులు జయరాం, నెట్టేకల్ హనుమంతు, నెట్టేకల్ నాగరాజు, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కలందర్, మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు హుస్సేన్ బాషా పాల్గొన్నారు.

జంగమ సేవా సంఘం ఆర్థిక సాయం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్



ఆర్థిక సాయం అందజేస్తున్న జంగమ సేవా సంఘం

అనాధ పిల్లలకు హాలహర్వి మండల బాపూరం గ్రామానికి చెందిన జంగమ సంఘం నాయకులు ఆర్థిక సాయం పంపిణీ చేశారు. మంగళవారం ఆదోని పట్టణానికి చెందిన వసుంధర ఏజెన్సీస్,కర్నూలు జిల్లా జంగమ సమాజ సేవా సంఘం గౌరవ అధ్యక్షులు ఎర్రిస్వామి సమావేశం నిర్వహించి రూ.41,116 అందజేశారు. పిల్లలకు భవిష్యత్తులో ఇక ఏదైనా అవసరం వస్తే వారి చదువుకు గాని పుస్తకాలు కానీ బట్టలకు కానీ సంఘం అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు. తంగారదోన పరమేశ్వరయ్య, కుంటనహాల మంజునాథ స్వామి, ఆదోని డివిజన్ జంగమ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఏడి.పురుషోత్తం, కుంటనహాల శివకుమార్ ఎంకే.బసవరాజు, ఆదోని డివిజన్ జంగమ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి అల్లూరు మఠం మహర్షి విజయకుమార్ స్వామి, హెచ్ఎం. వీరేష్, హెచ్ఎం.ఎర్రి స్వామి, తేక్కలకోట వీరేష్,టీచర్ చంద్రశేఖరయ్య, వీరభద్రయ్య స్వామి పాల్గొన్నారు.



మాలమల్లేశ్వరస్వామి భక్తాదులకు అన్నం వడ్డిస్తున్న ముస్లిం సోదరులు

ముస్లిం సోదరులు అన్నదానం

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరు నియోజకవర్గ కేంద్రంలో మతాలకు అతీతంగా అన్ని మతాల పండుగలను, శుభకార్యాలను ముస్లిం, హిందూ, క్రిస్టియన్‌లు సోదరభవంతో జరుపుకోవడం జరుగుతుంది. మంగళవారం దేవరగట్టు మాలమల్లేశ్వర స్వామి బన్ని ఉత్సవానికి జిల్లా, కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర, ఆంధ్రరాష్ట్రంలోని ఇతర జిల్లాల నుండి లక్షల మంది బక్తులు తిలకించేందుకు విచ్చేస్తున్న వారు, వయా ఆలూరు నుండి దేవరగట్టుకు వెళ్లే బక్తుల కొరకు ఆలూరు మజీద్ దగ్గర ముస్లిం సోదరులు అన్నదాన కార్యక్రమం నిర్వహించి తమ సోదర భావాన్ని చాటుకున్నారు. ఈ

వీరభద్రేశ్వరునికి వెండి చెంబు విరాళం

ప్రజాశక్తి - మంత్రాలయం



చెంబు విరాళం అందజేస్తున్న దాతలు

మండల కేంద్రమైన మంత్రాలయంలోని పాత ఊరులో వెలసిన వీరభద్రేశ్వర స్వామి ఆలయానికి స్థానికులైన విశ్వ బ్రాహ్మణ మధుసూదన ఆచారి అనే భక్తుడు రూ.16 వేల విలువ గల వెండి చెంబును పూజా రులకు విరాళంగా అందజేశారు. సోమవారం దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా విజయదశమి పండుగ సందర్భంగా వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో జరుగు నిత్య పూజలకు వినియోగించాలని కోరుతూ 2 వందల గ్రాముల వెండి చెంబును విరాళంగా ఇచ్చినట్లు దాత మధుసూదన ఆచారి తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం ట్రస్టు బోర్డు సభ్యులు జంగం సుజాత, శంకర్, ఆలయ అర్చకులు రుద్రయ్య స్వామి, లింగయ్య స్వామి ఉన్నారు.



ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎంపీపీ జూటూరు హేమలత మారయ్య

రాములమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - చిప్పగిరి

దసరా విజయదశమి పండుగను పురస్కరించుకుని చిప్పగిరి ఎంపీపీ జూటూరు హేమలత దసరా పండుగను పురస్కరించుకొని తమ సొంత గ్రామమైన దేగలహాలు గ్రామంలో రాములమ్మ దేవాల యంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ జూటూరు హేమలత మాట్లాడుతూ దసరా పండుగ బంధువులు, కుటుంబ సభ్యులతో కలిసి ప్రతియేట సంతోషంతో సంబరాలు జరుపుకునే పండు గన్నారు. ఇది తమ కుటుంబ సమేతంగా తరతరాల నుండి వచ్చే సాంప్ర దాయమన్నారు. ఈ సంవత్సరం వర్షాలు కురిసి పంటలు బాగా పండి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని రాములమ్మ దేవాలయంలో ప్రత్యేకమైన పూజలు నిర్వహించినట్లు తెలిపారు. మండలంలోని తదితర గ్రామాలలో దసరా పండుగ ప్రశాంతంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమ లో వైసీపీ కన్వీనర్ జూటూరు మారయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బైక్‌లు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కౌతాళం

రెండు బైకులు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం నాడు కౌతాళం పోలీస్ స్టేషన్ పరిధిలోని కుంభలనూరు గ్రామం వద్ద చోటు చేసుకుంది. ఎస్సై నరేంద్ర కుమార్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. కుంభలనురు గ్రామానికి చెందిన మహాదేవ, కర్ణాటక రాంపురం చెందిన మరో వ్యక్తి మోటర్ సైకిల్‌లు ఢీకొనడంతో ఇరివురకి గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మహాదేవ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మంత్రి ఇలాఖలో తాగునీటి ఎద్దడి

- రొడెక్కిన అరికేర గ్రామస్థులు

ప్రజాశక్తి - ఆలూరు



రోడ్డుపై బిందెలతో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు



పోలీసులతో మాట్లాడుతున్న సిపిఎం నేతలు

మంత్రి ఇలాఖా ఆలూరు నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, నియోజకవర్గంలో పట్టణ, గ్రామాలలో వారం నుండి 15 రోజులకోసారి తాగునీరు అందుతున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. దసరా పండుగ పర్వదినాన అధికారుల నిర్లక్ష్యంతో అరికెర గ్రామానికి 15 రోజులైనా తాగునీరు అందించకపోవడంతో ఆగ్రహించిన గ్రామస్థులు సోమవారం ట్రాక్టర్లు,ఆటోలలో ఆలూరు ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయాన్ని ముట్టడి చేయగా కార్యాలయనికి తాళం వేసి ఉండడంతో సిపిఎం అద్వార్యంలో రాస్తోరోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కెపి.నారాయణ స్వామి, అరికెర గ్రామ సర్పంచ్ నాగరాజు మాట్లాడుతూ అరికేర గ్రామానికి విరుపాపురం స్కీం నుండి తాగునీరు వదిలి 15 రోజులు పైబడిన ఇంతవరకు అధికారులు నిర్లక్ష్యంతో నీరు వదలకుండా ఇబ్బందులకు గురిచేసారన్నారు. ప్రజలకు తాగునీరు కూడా అందించలేని ప్రభుత్వాలు ఎందుకని ప్రశ్నించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఆస్పరి ఎస్ఐ వరప్రసాద్ తాగునీటి సమస్యను తెలుసుకొని సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్ డిఈ మల్లికార్జునకు ఫోన్‌లో మాట్లాడగా రాత్రిలోగా నీటిని వదిలి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ప్రజలు శాంతించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు షాకీర్, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి మైన గ్రామస్థులు పాల్గొన్నారు.

చంద్రబాబును విడుదల చేయాలి

- 'జగనాసుర దహనం'లో టిడిపి నేతలు

ప్రజాశక్తి - ఆదోని



సైకో జగన్ ప్రతులతో నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

మాజీ సీఎం చంద్రబాబు అరెస్టు అక్రమమని వెంటనే విడుదల చేయాలని టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు డిమాండ్ చేశారు. సోమవారం రాత్రి ఆదోనిలోని మనం చేద్దాం జగనాసుర దహనం కార్యక్రమంలో భాగంగా సైకో పోవాలి అంటూ ప్రతులను దహనం చేశారు. అంతకుముందు ఎన్టీఆర్ విగ్రహం వద్ద రోడ్డుపై బైఠాయించి ప్రభు త్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఉమాపతి నాయుడు మాట్లాడారు. చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేసి జైల్లో నిర్బంధించడం ప్రభుత్వానికి తగదని దుయ్యబట్టారు. వయసు మీద పడ్డ వ్యక్తి పట్ల కనీసం మానవత్వం కూడా చూపని దుస్థితిలో పాలకులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా చంద్రబాబును వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రంగస్వామి నాయుడు, రామస్వామి, వీరేష్, జయరాం, ఆరిఫ్, ఈరన్న, మల్లికార్జున, అంజి తదితరులు ఉన్నారు. **ఎమ్మిగనూరు రూరల్ :** టిడిపి రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు విజయదశమి సందర్భంగా స్థానిక వైయస్సార్ సర్కిల్ నందు సైకో పోవాలి పత్రాలను మంటల్లో దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆరవీటి సుధాకర్ శెట్టి, కదిరికోట ఆదెన్న, మాజీ జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ జి.అల్తాఫ్, ఆం.ప్ర సగర (ఉప్పర) ఫెడరేషన్ మాజీ డైరెక్టర్ ఉప్పర ఆంజనేయులు, కర్నూల్ పార్లమెంట్ టిడిపి కురువ సాధికారిక కమిటీ సభ్యులు అడ్వకేట్ కేటి మల్లికార్జున, మాజీ ఆత్మ చైర్మన్ కందనాతి శ్రీనివాసులు, బనవాసి నరేంద్ర రెడ్డి, తెలుగు మహిళా నాయకురాలు గోకారమ్మ, 16వ వార్డు బెస్త హనుమంతు,ఎమ్మిగనూరు మండలం టిడిపి నాయకులు మాసుమాన్ దొడ్డి బోయ శ్రీనివాసులు, గుడికల్ కోలంట్ల నాగరాజు, కోలంట్ల వెంకటేష్, కె. తిమ్మాపురం కురువ వీరేష్, పట్టణ టిడిపి ముస్లిం మైనార్టీ నాయకులు కె.యం.డి. అబ్దుల్ జబ్బర్, మదిరే పీర్ భాష, గోరా బాషా, మహబూబ్ బాషా, ఆఫ్గాన్ వలిభాష, జోహార్ అబ్బాస్, టిడిపి ఎస్సీ సెల్ నాయకులు రోజా ఆర్ఫ్ ఉసేని, సప్లయర్స్ బంగారప్ప, దర్జీ మోషన్న, అల్వాల ప్రసాద్, యస్.సాల్మన్, జాలవాడి ఏసన్న, పందికోన సురేష్, తదితరులు పాల్గొన్నారు. **కౌతాళం :** రాబోయే ఎన్నికలలో సైకో జగన్ ఓడిపోయి ఇంటికి పోతేనే రాష్ట్రం అన్ని విధాల అభివద్ధి చెందుతుందని టిడిపి మంత్రాలయం ఇన్చార్జ్ తిక్కా రెడ్డి పేర్కొన్నారు. సోమవారం శ్రీ నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రానికి చేరుకుని దర్శించుకు న్నారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జగన్ చిత్రపటాని దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నాలుగేళ్ల పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో 20 ఏళ్ల వెనక్కి వెళ్ళింద న్నారు. గ్రామాలు అభివద్ధి లేక వెలవెలబోతు న్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉరుకుంద ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ చెన్న బసప్ప, టిడిపి రైతు సంఘం రాష్ట్ర జిల్లా కార్యదర్శి అడివప్ప గౌడ్, వెంకటపతి రాజు టిడిపి నాయకులు కొట్రేష్ గౌడ్, కురుగోడు, రమేష్ గౌడ్, వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. **ఆలూరు :** ముఖ్యమంత్రి వైయస్ జగన్ రెడ్డికి ఓటమి భయం పట్టుకుందని చంద్రబాబుకు వస్తున్న ప్రజా ఆదరణ చూసి ఓర్వలేక అక్రమ కేసులు బనాయించి రాక్షసానందం పొందుతున్నారని టిడిపి వాణిజ్య సెల్ రాష్ట్ర కార్యదర్శి నారాయణ, మండల కన్వీనర్ అశోక్ యాదవ్, టిడిపి జిల్లా నాయకులు నరసప్ప, భాస్కర్, కొమ్ము రామంజి,నాగరాజు, సురేందర్ అన్నారు. సోమవారం ఆలూరు,మొలగవల్లిలో జగనాసురా దహన కార్యక్రమంలో భాగంగా సైకో పోవాలి అనే పత్రులను మంటల్లో వేసి నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. ఈకార్యక్రమంలో టిడిపి మాజీ జిల్లా కార్యదర్శి మోక మల్లయ్య, ఆంజనేయ్య, పట్టణ అధ్యక్షులు చంద్రశేఖర్, ముద్దరంగ, గూళ్యం రామంజినేయులు, జిలాన్ బాష, ఉప సర్పంచ్ రంగన్న, మాజీ సర్పంచ్ లు రంగస్వామి, వెంకటేశ్వర్లు, ఆంజి, లక్ష్మిపతి, ఐకాంత్, అంబన్న, మాణిక్య రెడ్డి, మసాల జగన్, జలంధర్ తదితరులు పాల్గొన్నారు. **హోళగుందలో** టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి మహ్మద్ ఆదాం, మండల కన్వీనర్ తిప్పయ్య జగనసురా దహన కార్యక్రమంలో భాగంగా సైకో పోవాలి కర్రపత్రలను కాల్చి నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడారు. టిడిపి సినియర్ నాయకులు గాదిలింగ, తిపన్న, వీరన్న, మంజనాథ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరు రూరల్ : సైకో జగన్ కరపత్రాలను దహనం చేస్తున్న నేతలు



సైకో జగన్ కరపత్రాలను దహనం చేస్తున్న తిక్కారెడ్డి

శ్రీమఠంలో వైభవంగా విజయదశమి

ప్రజాశక్తి - మంత్రాలయం



అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే



రథోత్సవంలో పాల్గొన్న పీఠాధిపతులు

మంత్రాలయంలో ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో విజయ దశమి వేడుకలను శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు నారయణ శెట్టి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. దేవి శరనవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గ్రామ దేవత మంచాల మ్మకు వాసవీమాత అమ్మవారికి తొమ్మిది రోజుల పాటు విశేష పూజలు నిర్వహించారు. విజయ దశమి సందర్భంగా గ్రామ దేవత మంచాలమ్మకు పీఠాధిపతులు సుగంధ ద్రవ్యాభిషేకం నిర్వహించి పుష్పార్చనతో అర్చించి మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం పాత ఊరులో వెలసిన శ్రీదేవి భూదేవి సమేతంగా వెలసిన వెంకటేశ్వరస్వామి రథోత్సవంలో పాల్గొని వసంతోత్సవం చేపట్టి భక్తులకు భక్తులకు ఆశీస్సులు అందించారు. ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి దుర్గామాత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం రాత్రి దుర్గా మాత అమ్మవారిని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌లో కొలువుంచి ఊరేగింపుతో తుంగభద్ర నదిలో నిమజ్జనం చేశారు. ఊరేగింపు సమయంలో ఆర్యవైశ్య యువతి, యువకులు, మహిళలు, పురుషులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఊరేగింపు కార్యక్రమానికి హాజరైన భక్తులకు జీపీఎస్ రెసిడెన్సీ నిర్వాహకులు నాగవేణి, అరవింద్ దంపతులు అల్పాహారం ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు వెంకటేష్ శెట్టి, శశికాంత్, ప్రహ్లద, కందుకూరు బసవరాజు, ఎస్. ఆర్. వేణు గోపాల్, సూర్య నారాయణ శెట్టి, లక్ష్మయ్య, వీరేష్, ఫణీంద్ర శెట్టి, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గుడిసె ఆది కృష్ణమ్మ హౌస్ అరెస్ట్

ప్రజాశక్తి - ఆదోని



గుడిసె ఆది కృష్ణమ్మ హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు చేపట్టనున్న జగన్నాసుర పాలన అంతం పత్రాల దహనాన్ని పోలీసులు అడ్డుకొని టిడిపి నేత కృష్ణమ్మను హౌస్ అరెస్ట్ చేశారు. సోమవారం రాత్రి ఆదోని నియోజకవర్గంలోని మండగిరి పంచాయతీలో టీడీపీ మాజీ ఇంచార్జ్ గుడిసె ఆది క్రిష్ణమ్మను ఆమె నివాసంలో ఆదోని పట్టణ మూడవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ విజయలక్ష్మి పోలీస్ సిబ్బందితో కలిసి జగనాసుర దహన కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. అనంతరం గుడిసె ఆది కృష్ణమ్మ మాట్లాడుతూ తాము చట్టాన్ని ఎక్కడ ఉల్లం ఘించలేదని పోలీసులు కావాలని టిడిపి నాయకుల నిరసనను అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల్ని అష్టకష్టాలు పెడుతున్న జగనాసురుడి పాలన అంతమే లక్ష్యంగా అంతా కలిసి పోరాడు దామని, అదే రాష్ట్రానికి అసలు సిసలైన విజయం తెచ్చే విజయదశమి అని ఆమె పేర్కొంటూ అందరికీ దసరా శుభాకాంక్షలు చెప్పారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్య క్షులు గుడిసె శ్రీరాములు, వడ్డేమాన్ గోపాల్, తెలుగు దేశం పార్టీ కర్నూలు జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు జి రామకృష్ణ, మురళి టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కారు కంటైనర్ ఢీకోని ఒకరు మృతి

- నలుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - మంత్రాలయం

రాఘవేంద్రస్వామిని దర్శించుకొని కుటుంబంతో కారులో భక్తుల తిరుగు ప్రయాణంలో కారును కంటైనర్ ఢీకొని భక్తుడు చనిపోయిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. సోమవారం ఎస్ఐ వేణుగోపాల్ రాజు తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రం కాంచీపురంకు చెందిన అంబర్సన్ కుటుంబం సభ్యులతో మంత్రాలయం వచ్చారు. సోమవారం రాఘవేంద్రస్వామిని దర్శించుకొని మంత్రాలయం నుండి సొంత గ్రామానికి తిరుగు ప్రయాణంలో ఎమ్మిగనూరు నుంచి మంత్రా లయం వైపు వస్తున్న కేఏ 59 3082 నెంబర్ గల కంటైనర్ డ్రైవర్ అమోల్ రాథోడ్ అతివేగంతో అజాగ్రత్తతో వచ్చి కారును ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో అంబర్సన్ అక్కడికక్కడే చెందాడు. గాయత్రి, ఉమా పార్వతి, సూర్య, అలేఖ్యలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ సంఘటన స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడిన వారిని చికిత్స నిమిత్తం కర్నూల్‌కు తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



మృతిచెందిన అంబర్సన్



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు



ప్రజలతో మంత్రి గుమ్మనూరు జయరాం

దేవరగట్టులో మంత్రి పూజలు

ప్రజాశక్తి - హోళగుంద

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం దేవరగట్టు మాళమల్లేశ్వర స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఈ సంవత్సరం దసరా ఉత్సవాలలో భాగంగా బన్ని ఉత్సవం జరుగుతుందన్నారు. పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సంవత్సరం బన్నీ ఉత్సవం భక్తదులు అన్ని ఏర్పాట్లు చేశామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి సోదరులు ఆలయ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, గుమ్మనూరు నారాయణ స్వామి, ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ, జడ్పీటీసీ ఏరూరు శేఖర్, నేరిణినికి, తండా, కొత్తపేట, గ్రామా ల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్కూటర్ ర్యాలీని జయప్రదం చేయండి : సిపిఎం



ఏర్పాట్లపై సమావేశమైన నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

ఈ నెల 30న మొదలయ్యే బస్సు జాతాకు సంఘీభావంగా ఈనెల 29న నిర్వహించే బైకు ర్యాలీని జయప్రదయం చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్ కోరారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో డివైఎఫ్ఐ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాటా డారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు సాగు చేసిన పంట లు చేతకందక నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయాలని కోరు తూ సిపిఎం ఆధ్వర్యంలో బస్సు జాత చేపడుతున్నామని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ అధ్యక్షుడు వీరేష్, నాయకులు వెంకటేష్, నాగరాజు, శ్రీకాంత్ ఉన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

- వైసిపి రాష్ట్ర యువజన నాయకుడు ప్రదీప్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - కోసిగి

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వైసిపి రాష్ట్ర యువజన నాయకులు వై. ప్రదీప్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కోసిగిలో మండల వైసీపీ నాయకుడు ఆకాష్ రెడ్డికి సంబంధించిన నూతన వెంకటేశ్వర ట్రేడర్స్ షాపు ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా వైసీపీ రాష్ట్ర యువజన విభాగం నాయకులు వై. ప్రదీప్ రెడ్డి హాజరైయారు. ఈ సందర్భంగా వై ప్రదీప్ రెడ్డి చేతుల మీదుగా నూతన వెంకటేశ్వర ట్రేడర్స్ షాపును రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకుడు ఆకాష్ రెడ్డి, వై ప్రదీప్ రెడ్డికి శాలువా కప్పి గజమాలతో సత్కరించారు. అనంతరం నూతన వెంకటేశ్వర ట్రేడర్స్ షాపు ప్రారంభోత్స వానికి కార్యక్రమానికి ఎంపిపి ఈరన్న, నాడిగేని నాగరాజు, మాజీ జెడ్పిటిసి మంగమ్మ, జగదీష్ స్వామి, హెూళగుంద కోసిగయ్య, జోల్లయ్య, సతీష్ అగసనూర్ బాబురెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ఎరువులు దుకాణాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

రైతులకు సాగునీరు విడుదల


- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి కౌతాళం

ఎట్టకేళ్లకు రైతులకు ఎల్ఎల్‌సి కింద సాగునీరు విడుదల అయ్యింది. తుంగభద్ర దిగువ కాలువ మాధవరం మేజర్ డిస్ట్రిబ్యూటర్ కింద హాల్వి సెక్షన్ పరిధిలో రైతులకు సాగునీరు అందడం లేదని 'రైతుల కడుపు కొట్టొద్దు' శీర్షికతో ప్రజాశక్తిలో ప్రచురించడం జరిగింది. సాగునీరు కోసం అధికారుల కాళ్లు పట్టుకున్న రైతు పరిస్థితిని ప్రజాశక్తి ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. మండల పరిధిలోని మధిర, పొదలకుంట గ్రామానికి చెందిన రైతులు సాగునీటి కోసం సుమారు 5 గంటలకు పైగానే ఆల్వి సెక్షన్ వద్ద ఆందోళన నిర్వహించిన సంగతి తెలిసిందే. జిల్లా అధికారులు వెంటనే స్పందించి ఎల్ఎల్‌సి డిఇ మొహమ్మద్ సైపుల్లను ఆదేశించడంతో సోమవారం ఉదయమే కాల్వపై పర్యటించారు. రైతులతో నీటి సమస్యపై చర్చించి మాధవరం మేజర్ డిస్ట్రిబ్యూటర్ నీటిమట్టం పరిశీలించి విడుదల చేశారు. రైతులు వరి పంటకు నీటిని వినియోగిం చుకుని కాపాడుకోవాలని సూచించారు. ఈయనతో పాటు జెఇ హుస్సేన్ ఎల్ఎల్‌సి సిబ్బంది పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఎల్ ఎల్ సి డి ఈ ఈ మొహమ్మద్ సైపుల్ల





మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.యేసురత్నం

దసరా 'దోపిడీ'

- ఇష్టారాజ్యంగా ప్రయివేటు బస్సు ఛార్జీలు
- ఖాళీ అవుతున్న సామాన్యుల జేబులు
- ఛార్జీల నియంత్రణలో అధికారులు విఫలం

పండుగ సీజన్ వచ్చిందంటే ప్రయివేటు ఆపరేటర్లు వసూళ్ల పండగ చేసుకుంటున్నారు. ఇష్టానుసారంగా బస్సుల ఛార్జీలను పెంచేసి ప్రయాణికులను నిలువు దోపిడీ చేసేస్తున్నారు. రద్దీకి అనుగుణంగా ఛార్జీలను బాదేస్తున్నారు. దసరా సెలువులు రావడంతో ప్రయివేటు బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు పర్సు ఖాళీ కాక తప్పడం లేదు...



ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

పండుగ సీజన్‌లో ప్రయాణికుల నుంచి ఏర్పడిన డిమాండ్‌నే ప్రయివేటు ట్రావెల్స్ సొమ్ము చేసుకుంటున్నాయి. బస్సు రూటుతో పని లేకుండా చార్జీలను రెట్టింపు చేసేసారు. అదనపు ఛార్జీలు వసూలు చేయకుండా ఛార్జీలను నియంత్రించాల్సిన రవాణా శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న బహిరంగ విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆర్టీసిలోని సూపర్ లగ్జరీ బస్సుల్లో కర్నూలు నుంచి హైదరాబాద్‌కు రూ.350 ఉండగా అదే మార్గంలో ప్రయివేటులో నాన్ ఎసి సీటర్‌లో రూ.1500 వరకూ, ఎసి సీటర్‌లో రూ.1200 నుంచి రూ.2111, నాన్ ఎసి స్లీపర్‌లో అయితే రూ.900 నుంచి రూ.2వేల వరకూ, ఎసి స్లీపర్‌లో రూ.1749 నుంచి రూ.3399 వరకూ వసూలు చేస్తున్నారు. పండుగ సెలవులు ముగియడంతో కర్నూలు నుంచి హైదరాబాద్ నుంచి వెళ్లే వారి సంఖ్య ఎక్కువ ఉండటంతో ఆ రూట్‌లో ప్రయివేటు ట్రావెల్స్ అధిక మొత్తంలో దండుకుంటున్నాయి. హైదరాబాద్ నుంచి నంద్యాలకు ఎపిఎస్‌ఆర్‌టిసిలో రూ.490 ఉండగా అదే మార్గంలో ప్రయివేటులో నాన్ ఎసి సీటర్‌లో రూ.600 నుంచి రూ.1290 వరకూ, ఎసి సీటర్‌లో రూ.850 నుంచి రూ.2590, నాన్ ఎసి స్లీపర్‌లో అయితే రూ.1400 నుంచి రూ.3వేల వరకూ, ఎసి స్లీపర్‌లో రూ.1100 నుంచి రూ.2990 వరకూ వసూలు చేస్తున్నారు. కర్నూలు నుంచి విజయవాడకు ఆర్టీసి సూపర్ లగ్జరీలో రూ.512 ఛార్జీ ఉండగా ప్రయివేటులో సీటర్‌లో రూ.858 వరకూ వసూలు చేస్తున్నారు. అదే మార్గంలో ఆర్టీసి స్లీపర్‌లో రూ.870 ఉండగా ప్రయివేటులో రూ.990 నుంచి రూ.1130 వరకూ ఉంది. విజయవాడ నుంచి కర్నూలుకు స్లీపర్‌లో రూ.800 నుంచి రూ.1090 వరకూ వసూలు చేస్తున్నారు.

బ్లాక్‌లోనూ టికెట్లు

పండగ సీజన్‌లో ఊరికెళ్లేందుకు ప్రయాణికులు సీట్ల కోసం నానా తంటాలు పడాల్సి వస్తోంది. వారం రోజుల ముందు నుంచే ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకునేందుకు ప్రయత్నాలు మొదలెట్టినా సీట్లు లభించడం లేదు. ఆయా ప్రయివేట్ ట్రావెల్స్ ఆపరేటర్లు ముందుగా టికెట్లను బుక్ చేసేసి ప్రయాణికుల నుంచి వచ్చే డిమాండును బట్టి బ్లాక్‌లో అధిక ధరలకు విక్రయించుకుంటున్నారన్న వార్తలూ వినిపిస్తున్నాయి.

31న ప్రజారక్షణ భేరి జాతా

- జయప్రదం చేయండి : సిపిఎం

ప్రజాశక్తి - ఆత్మకూర్

రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం రూపొందించిన ప్రణాళిక అమలు కోసం సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజారక్షణభేరి బస్సు జాతాను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.యేసు రత్నం, పట్టణ కార్యదర్శి ఏ. రణధీర్‌లు కోరారు. బస్సు జాతా ఈ నెల 31వ తేదీ మంగళవారం ఉదయం 11 గంటలకు పట్టణంలోని పాత బస్టాండ్‌కు చేరుకుంటుందని తెలిపారు. మంగళవారం పట్టణంలోని స్థానిక సుదర్శన వర్మ భవన్ నందు సిపిఎం పట్టణ కమిటీ సమావేశం నాయకులు డి.రామ్ నాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం అన్ని రంగాలలో నష్టపోయామన్నారు. ఉద్యోగాలు లేవు, ఉపాధి లేదు, వెనకబడ్డ రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ లేదు అని పేర్కొన్నారు. రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల సరుకుల ధరలతో సామాన్య ప్రజలు కుదేలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే పాలక ప్రభుత్వాలు పలు చేస్తున్నాయని వారు ఆరోపించారు. అప్పుల కోసం కేంద్ర ప్రభుత్వం వద్ద ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విద్యుత్ రంగాన్ని ప్రైవేటు పరం చేసేందుకు ప్రయత్నం చేస్తోందన్నారు. దీనివల్ల గృహ వినియోగదారులపై ఆర్థిక భారం, ప్రైవేట్ పరిశ్రమల మునగడకు ఇబ్బంది కలగడమే కాకుండా పాలిటెక్నిక్ ఐటిఐ వంటి అర్హతలతో పనిచేస్తున్న స్కిల్ సెమీ స్కిల్ ఉద్యోగాలు గల్లంతవుతాయని వారు తెలిపారు. ఇలాంటి సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో ప్రజా రక్షణ భేరి రాష్ట్ర బస్సు జాత నిర్వహిస్తుందని అన్నారు. బస్సు జాత ఈ నెల 31వ తేదీ మంగళవారం ఉదయం 11గంటలకు పట్టణంలోని పాత బస్టాండ్‌కు చేరుకుంటుందని పట్టణం లోని పెద్దలు, ప్రజలు,మేధావులు, లౌకికవాదులు, ప్రజాతంత్ర వాదులు, నిరుద్యోగులు, కార్మికులు, కర్షకులు,ప్రతి ఒక్కరు పాల్గొని జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పట్టణ సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు ఏ సురేంద్ర,జి నాగేశ్వరరావు, షేక్ ఇస్మాయిల్, సద్దాం హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో దేవస్థానం ఉద్యోగి మృతి

ప్రజాశక్తి - మహానంది

మహానంది దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి డిపి.శివ కుమార్(35) గుండెపోటుతో మంగళవారం మతి చెందారు. ఉదయం శివ కుమార్ గుండె నొప్పితో కుప్పకూలడంతో కుటుంబ సభ్యులు అతన్ని చికిత్స నిమిత్తం నంద్యాల తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు వున్నారు. శివ కుమార్ మృతి పట్ల దేవస్థానం సిబ్బంది, స్థానికులు, బంధువులు సంతాపం వ్యక్తం చేశారు.

ఇమ్మానియేల్ ఆశయ సాధనకు కృషి చేయాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్‌కుమార్

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

భూస్వాముల ఆగడాలకు వ్యతిరేకంగా, బడుగు బలహీన వర్గాలకు అండగా పోరాటం చేసి అసువులు బాసిన కామ్రేడ్ ఇమ్మానియేల్ ఆశయ సాధన కోసం కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఏ.కోడూరు గ్రామంలో కామ్రేడ్ ఇమ్మానియేల్ వర్ధంతి సందర్భంగా ఆయన స్మారక స్థూపం వద్ద నివాళ్లులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎం కార్యకర్తలు, నాయకులు, సభ్యులు, సానుభూతిపరులు సోషలిజం స్థాపన కోసం, పేద ప్రజలకు న్యాయం కోసం పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రత్నమయ్య, సీనియర్ నాయకులు రామరాజు, టి.రామచంద్రుడు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి డేవిడ్, అధ్యక్షుడు సుబ్బరాయుడు, సిపిఎం నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



నివాళ్లులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ముగిసిన దసరా మహోత్సవాలు

- భ్రమారాంబ దేవి నిజాలంకరణ, నంది వాహనంపై స్వామి అమ్మవార్లు
- పూర్ణాహుతి, శమీ పూజ, తెప్పోత్సవం

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలంలో జరుగుతున్న దసరా మహోత్సవాలు పూర్ణాహుతి కార్యక్రమంలో మంగళవారం మగిశాయి. చివరి రోజు భ్రమారాంబ దేవి నిజాలంకరణ అలంకారంలో అమ్మవారికి, నందివాహనంపై స్వామి అమ్మవార్లను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామి వారి యాగశాలలో సాంప్రదాయపదంగా రుద్రయాగ పూర్ణాహుతి, కలశద్వాసన నిర్వహించారు. ఇందులో సుగంధ ద్రవ్యాలు, నారికేళములు, నూతన వస్త్రాలు హోమ గుండంలో సమర్పించారు. అంతకుముందు తభ్రమరాంబ దేవి ఆలయంలో భ్రమరాంబ దేవిని నిజాలంకరణలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నంది వాహనంపై స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శమీ పూజ : దసరా మహోత్సవాలలో శమీ పూజ ఎంతో ముఖ్యమైనది. ఇందులో నంది వాహనంపై స్వామి అమ్మవార్లను శమీ వృక్షం వద్దకు తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తెప్పోత్సవం : దసరా మహోత్సవాలలో తెప్పోత్సవం కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా ఆలయానికి **మిగతా 6వ పేజీలో...**



శ్రీశైలంలో పూర్ణాహుతి కార్యక్రమంలో భాగంగా హోమగుండంలో సుగంధ ద్రవ్యాలు, నారి కేళములు, నూతన వస్త్రములు సమర్పిస్తున్న దృశ్యం



మహానందిలో జమ్మి చెట్టు వద్ద పూజలు చేస్తున్న దృశ్యం



విజేతగా నిలిచిన చాగలమర్రి జట్టు

ఫుట్‌బాల్ విజేత చాగలమర్రి జట్టు

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో దసరా సందర్భంగా జరిగిన రాయలసీమ స్థాయి ఫుట్‌బాల్ పోటీలలో చాగలమర్రి జట్టు విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఈ పోటీలలో కడప, నంద్యాల జిల్లాలకు చెందిన 6 జట్లు పాల్గొన్నాయని, ఫైనల్‌లో కడప జట్టుపై చాగలమర్రి జట్టు 1-0 గోల్స్ సాధించి విజేతగా నిలిచిందన్నారు. విజేత జట్టుకు దాత ఇర్షాద్ రూ.5 వేల నగదు, ట్రోఫీ, ద్వితీయ స్థానం కడప జట్టుకు దాత రియాజ్ రూ.2 వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో పిడి దాదాపీర్, నిర్వహకులు స్వర్ణకుమార్, మోచర్ల నరసింహ, సునీల్, మన్సూర్, పకీర్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు పోలీస్ స్టేషన్లో ఆయుధ పూజ

ప్రజాశక్తి - పాములపాడు

విజయదశమి దసరా సందర్భంగా పాములపాడు పోలీస్ స్టేషన్‌లో ఎస్సై జి అశోక్, సిబ్బందితో కలిసి సోమవారం ఆయుధ పూజ నిర్వహించారు. స్టేషన్లో వివిధ రకాల ఆయుధాలకు, వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల ప్రజలు సుఖ సంతోషాలతో, సంపదతో సంతోషంగా పండగ జరుపుకోవాలని కోరుకుంటూ మండల ప్రజలకు, నాయకులకు, అధికారులకు దసరా పండగ శుభాకాంక్షలు ఎస్ఐ అశోక్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌సి రామేశ్వరరావు, ఎర్రన్న, పిసిలు యాగంటి, కాజా, పవన్ కుమార్, రసూల్ పాల్గొన్నారు.



ఆయుధ పూజలు నిర్వహిస్తున్న ఎస్సై జి అశోక్

వ్యక్తిపై పీడీ యాక్ట్ నమోదు

- కడప జైలుకు తరలింపు : ఎస్‌పి కె.రఘువీర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణ ప్రాంతలో నిరంతరము గూండా, బూట్ లెగ్గర్ కార్యకలాపాలకు, ఇతర ప్రాపర్టీ కేసులకు సంబంధించి క్రిమినల్ నేరాలకు పాల్పడుతున్నారని, ప్రజలకు ప్రమాదకరముగా మారుతున్నారని, మహానంది మండలానికి చెందిన వ్యక్తిపై పీడీ యాక్ట్ నమోదు చేసి కడప జైలుకు తరలించినట్లు జిల్లా ఎస్పీ కె.రఘు వీర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహానంది మండలం బుచ్చమ్మ తోట గ్రామానికి చెందిన ఏరుకలి నల్లబోతుల నాగప్ప (అలియాస్ రాజు, శివారెడ్డి) గత కొన్ని సంవత్సరాలుగా ఉమ్మడి కర్నూల్ జిల్లా, అనంతపురం, కడప, ప్రకాశం జిల్లాలతో పాటు కర్ణాటక రాష్ట్రంలో కూడా దాదాపు 100కి పైగా ఇండ్లలో, 30 ఆలయాల్లో దొంగతనాలకి పాల్పడి ఇటీవలే 12 కేసులలో నేరం నిరూపణ అయ్యి శిక్ష అనుభవించి జైలు నుండి బయటికి వచ్చాడన్నారు. జైలు నుండి బయటికి వచ్చినా అతనిలో ఎలాంటి మార్పు రాకపోగా గత 2 నెలల క్రితం వరుసగా శిరివెళ్ళ మండలంలోని వెంకటాపురం గ్రామంలోని శివాలయంలో, మహాదేవపురం గ్రామ పరిధిలోని సర్వలక్ష్మీ నరసింహ దేవాలయంలోని హుండీలను, నంద్యాల తాలూకా పిఎస్ పరిధిలో దేవాలయంలో కూడా దొంగతనాలు చేసి ప్రజల మనోభావాలను దెబ్బ తీస్తూ జైలు పాలయ్యాడని తెలిపారు. ఇతని ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేనందున జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపగా పీడీ యాక్ట్‌కు ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా ఈ నెల 23న శిరివెళ్ల ఎస్ఐ అదుపులోకి తీసుకొని కేంద్ర కారాగారం కడప జైలుకు తరలించినట్లు వెల్లడించారు.

పారిశుధ్య కార్మికుడికి అండగా ఎంఎ రషీద్

ప్రజాశక్తి - ఆత్మకూర్

మున్సిపల్ పారిశుధ్య కార్మికుడు పోతురాజు విజయ్‌కి మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఎంఎ రషీద్ అండగా నిలిచారు. సోమవారం తెల్లవారుజామున విధి నిర్వహణ మున్సిపల్ పారిశుధ్య కార్మికుడు పోతురాజు విజయ్‌కి ఆకస్మికంగా గుండెపోటు రావడంతో ప్రైవేటు క్లినిక్‌లో చికిత్స తీసుకుంటున్న విషయాన్ని తెలుసుకున్న మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఎంఎ రషీద్ వంశీ క్లినిక్ దగ్గరికి వచ్చి విజయ్ ఆరోగ్య జాగ్రత్తలు తెలుసుకున్నారు. ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో ఆస్పత్రి సూపర్డెంట్ డాక్టర్ రాయుడుతో మాట్లాడి రూ.40 వేలు విలువచేసే గుండెకు సంబంధించిన ఇంజక్షన్‌ను దగ్గర ఉండి ఎంఎ రషీద్ వేయించారు. అక్కడ నుంచి కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు భరోసా కల్పించి ఆర్థిక సహాయం అందజేశారు. అత్యవసర పరిస్థితి ఉంటే వెంటనే తనకు సమాచారం ఇవ్వండి అంటూ విజయ్ కుటుంబానికి భరోసా కల్పించారు.



ఖరీదైన మందులను డాక్టర్లకు అందజేస్తున్న ఎంఎ రషీద్

నేడు, రేపు గొర్విమానుపల్లిలో 'గడప గడప'

- వైసిపి మండల కన్వీనర్ అంబటి గురివిరెడ్డి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

మండలంలోని గొర్విమానుపల్లి (సచివాలయం) కొండమీది పల్లె గ్రామ పరిధిలో నేడు, రేపు జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ మండల కన్వీనర్ అంబటి గురివిరెడ్డి కోరారు. మంగళవారం ఆయన విలేకరులో మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో బనగానపల్లి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పాల్గొంటారని తెలిపారు. మండలంలోని సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న అంబటి గురివిరెడ్డి



భూమి పూజ చేస్తున్న చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి

పార్కు నిర్మాణానికి చైర్మన్ భూమి పూజ

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూరు పట్టణంలోని 1వ వార్డు కౌన్సిలర్ కాటేపోగు చిన్న రాజు ఆధ్వర్యంలో రూ. 40 లక్షలతో ఎబిఎం పాలెం పార్కు నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి మంగళవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధే లక్ష్యంగా షాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి తో మాట్లాడి వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు సహకరిస్తామని చెప్పారన్నారు. కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యులు జబ్బార్, కౌన్సిలర్లు అబ్దుల్ హమీద్, చాంద్బాషా, అబ్దుల్ రవూఫ్, మానపాడు అశోక్, షేక్ నాయబ్, లాలూ ప్రసాద్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు బొల్లెద్దుల రామకీష్ణ, వైసిపి నాయకులు ఉస్మాన్ బేగ్, సప్లయర్ సత్యనారాయణ, రజిని కుమార్ రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, ఉపేంద్ర రెడ్డి, గోవింద్ రెడ్డి, రమేష్, ఆర్టీసీ బాబు, మార్కెట్ రాజు, ఉస్మాన్, బీసీ నాయకులు కాలూరి శివప్రసాద్, పగిడ్యాల సర్పంచి పెరుమాళ్ళ శేషన్న, కురువ శీను, రమేష్, బ్రహ్మయ్య ఆచారి, శాలి భాష, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నాగాభరణం బహూకరణ

ప్రజాశక్తి - బేతంచర్ల

బేతంచెర్ల మండలం హెచ్.కొట్టాల గ్రామ సమీపంలో వెలసిన ముచ్చట్ల మల్లికార్జున స్వామి వారికి అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం కోమటికుంట్ల గ్రామానికి చెందిన నంబూరి తిలక్ కుమార్ నాయుడు, శ్రావణి దంపతులు 250 గ్రాముల వెండి నాగాభరణం మంగళవారం బహూకరించారు. నాగాభరణమును ఆలయ అర్చకులు చంద్రశేఖర్‌కు దాతలు అందజేశారు.

అన్నదాన పథకానికి విరాళం

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రాన్ని సందర్శించే యాత్రికులకు, భక్తులకు దేవస్థానం అందిస్తున్న నిత్య అన్నదాన ప్రసాద వితరణకు మంగళవారం గుంటూరుకు చెందిన డి.దుర్గాబాయి, కెపి.రాజ్ కుమార్‌లు రూ. 1,00,101, ఆదోనికి చెందిన బొమ్మన చంద్ర శేకర్ రెడ్డి రూ.1,00,116 విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని సహాయ కార్యనిర్వహణాధికారి ఎం. ఫణిధర ప్రసాద్‌కు అందజేశారు. దాతలకు శేష వస్త్రాలను, ప్రసాదాలను అందజేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

అలరించిన దసరా వేషధారణ పోటీలు

- ఎమ్మెల్యే సహకారంతో విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల టౌన్ హాలు నందు నంద్యాలకే ప్రత్యేకమైన దసరా శక్తి వేషాల పోటీలు ఘనంగా నిర్వహించార. దసరా వేషాల కళ అంతరించి పోకుండా మరలా పునరుజ్జీవం కల్పించేలా నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి నగదు బహుమతులు అందజేయడం పట్ల కళాకారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా పోటీలు నిర్వహించి, అటు కళాకారులను ఇటు జానపద కళారూపాలను పరిరక్షించే బాధ్యత తీసుకున్నందుకు స్మార్ట్ సిటీ నంద్యాల వారికి నంద్యాల పట్టణ ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ పోటీలో పాల్గొన్న బాబు గ్రూప్ ప్రథమ బహుమతి రూ.50,000, ద్వితీయ బహుమతి సనా గ్రూప్ రూ.30,000, సురేష్ గ్రూప్ రూ.20,000లను తృతీయ బహుమతిగా గెల్చుకున్నారు. న్యాయ నిర్ణేతల చేత వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెసు పార్టీ నాయకులు, కౌన్సిలర్లు, స్మార్ట్ సిటీ నంద్యాల వాలంటీర్స్ తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న దృశ్యం





హైకోర్టు న్యాయవాదిని ఆహ్వానిస్తున్న దృశ్యం

దస్తగిరి స్వామి జార్తులకు అఖిలప్రియ దంపతులకు ఆహ్వానం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

రుద్రవరం మండలం, చిత్రేనిపల్లె గ్రామంలో గురువారం జరిగే దస్తగిరి స్వామి జార్తులకు హాజరుకావాలని టిడిపి మాజీ మంత్రి భూమా అఖిలప్రియ ,భార్గవ్ రామ్ దంపతులను అలాగే యువ నాయకులు భూమా విఖ్యాత్ రెడ్డిని చిత్రేనిపల్లె జనసేన, టిడిపి నాయకులు ఆహ్వానించారు. సోమవారం అఖిలప్రియ స్వగృహానికి చేరుకొని ఆహ్వానించారు. అలాగే టిడిపి నాయకులు, హైకోర్టు న్యాయవాది గోగిశెట్టి నరసింహారావుని ఆహ్వానించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త, అహెూబిలం బలిజ అన్నదాన సంఘం గౌరవాధ్యక్షుడు శెట్టి విజయకుమార్ ను ఆహ్వానించారు.. ఈ కార్యక్రమంలో తాలూకా జనసేన నాయకులు మైలేరి మల్లయ్య, నరేంద్ర గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సిద్ధరామేశ్వర స్వామికి జలాభిషేకం

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల : వర్షాలు కురవాలని కోరుఊ మండలంలోని బెలుం గ్రామస్తులు సిద్ధరామేశ్వర స్వామికి సోమవారం జలాభిషేకం చేశారు. ఆలయ అర్చకులు వెంకటేశ్వర్లు స్వామి, ఆలయ ధర్మకర్త వెంకటసుబ్బారెడ్డి, గ్రామ పెద్దలు, భక్తుల ఆధ్వర్యంలో స్వామి వారికి 1001 బిందెలతో జలాభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పండితులు మహేష్, ప్రజలు, యువత పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - కొత్తపల్లి : కొత్తపల్లిలోని ఎంపిడిఒ కార్యాలయంలో నేడు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మేరీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని, అధికారులు తమ శాఖల పరిధిలో నివేదికలను సిద్ధం చేసుకుని రావాలని తెలిపారు.

అమ్మవారి శాలకు విరాళం

ప్రజాశక్తి బేతంచెర్ల : బేతంచెర్ల పట్టణంలో వెలసిన అమ్మవారి శాలకు దసరా నవరాత్రుల సందర్భంగా పట్టణానికి చెందిన రావూరి గురువయ్య కుమారులైన కృష్ణమూర్తి, కుసుమాంబ కుమారుడు కాశీ విశ్వనాథ్, శ్రీనివాసులు రూ.35,116 విరాళంగా ఆర్యవైశ్య సంఘం నాయకులు గుండా గోపాల్, మోహన్ రావు ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం తరఫున దాతలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. శేషమోహన్ సుబ్రహ్మణ్యం, చిన్ని శేషఫణి, విష్ణు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రానికి పట్టిన జగనాసుర పీడ పోవాలి : టిడిపి

- జిల్లాలో జగనాసుర దహనం కార్యక్రమం

ప్రజాశక్తి - కొత్తపల్లి

రానున్న ఎన్నికల్లో రాష్ట్రానికి పట్టిన జగనాసుర పీడ విరగడ కావాలని టిడిఇప మండల నాయకులు కర్నాటి శివారెడ్డి అన్నారు. విజయదశమి పండగ సందర్భంగా టిడిపి పిలుపుమేరకు జగనాసుర దహనం కార్యక్రమాన్ని మంగళవారం వీరాపురం గ్రామంలో నిర్వహించారు. సైకో పోవాలి, సైకిల్ రావాలి కరపత్రాలను మంటల్లో కాల్చివేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సైకో జగన్ రెడ్డి రాజకీయంగా చంద్రబాబు నాయుడును ఎదుర్కొనలేక అక్రమంగా కేసులు బనాయించి అరెస్టు చేయించారని అన్నారు. జగనాసుర రాక్షస పాలన మునుపెన్నడూ ఎవరు చూసి ఉండరని అన్నారు. కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షురాలు సరళ, ఐ టిడిపి మండల అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, సోముల రామిరెడ్డి, సహదేవ రెడ్డి, కర్నాటి అశోక్ రెడ్డి, శంకర్ రెడ్డి, మాజీ సర్పంచి గనుమల పుల్లన్న, ప్రభావతమ్మ, వీరమ్మ, లక్ష్మి దేవమ్మ, లహరి తదితరులు పాల్గొన్నారు. **బనగానపల్లె :** టిడిపి అధ్యక్షుడు చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుకు నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ నాయకులు జగనాసుర దహనం కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోనిపార్టీ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు వరకు టిడిపి నాయకులు ర్యాలీ నిర్వహించి. తెలుగు యువత జిల్లా అధ్యక్షులు బొబ్బల గోపాల్ రెడ్డి, పట్టణ ఉపసర్పంచి బురానుద్దీన్, యాగంటి పల్లె ఉపసర్పంచి బండి మౌళేశ్వరరెడ్డి, పట్టణ అధ్యక్షులు ఖాసింబాబు, నాయకులు కాట్రెడ్డి మల్లికార్జున రెడ్డి, రాయలసీమ సలాం, అన్వర్ సాహెబ్, ఖాదర్ బాషా, కార్యకర్తలు పాల్గొన్నారు. **బేతంచెర్ల :** బేతంచెర్ల మండలం రుద్రవరం గ్రామంలో జగనాసుర దహన కార్యక్రమం టిడిపి యువజన నాయకుడు సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సైకో జగన్ అనే చెడుపై మంచి అనే చంద్రబాబు సాధించబోయే విజయంగా దసరా పండగను చేసుకుందామన్నారు. కార్యక్రమంలో సురేష్, హేమంత్, తిరుమలేశు, వీరాంజనేయులు, శ్రీనివాసులు, సంజు, మంటి రాజు, గిరి, గణేష్, మంటి ప్రసాద్, మాధవస్వామి, మారి, రామకృష్ణుడు, మహేంద్ర, మోహన్ పాల్గొన్నారు. **పాములపాడు :** జగన్ పాలన పోవాలని విజయదశమి రోజు తెలుగు యువత మండల అధ్యక్షులు మధు కృష్ణ ఆధ్వర్యంలో సైకో పోవాలి-సైకిల్ రావాలి అనే పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి పాలన పోయి మంచి పాలన వస్తుందని, న్యాయమే గెలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో మైనారిటీ నాయకులు ఉస్మాన్ బాషా, మద్దిలేటి, శివ, మధు, రాజేష్, గురునాథం, మహేశ్వర రావు, మహేష్, ప్రసాద్, శివ, సత్యనారాయణ బాషా పాల్గొన్నారు.



కొత్తపల్లి : కరపత్రాలను దహనం చేస్తున్న నాయకులు



బనగానపల్లె : కరపత్రాలతో నిరసన చేపడుతున్న నాయకులు



బేతంచెర్ల : కరపత్రాలను దహనం చేస్తున్న నాయకులు



పాములపాడు : కరపత్రాలను దహనం చేస్తున్న నాయకులు

చెరువుపల్లెను అభివృద్ధి చేశాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

చెరువుపల్లి గ్రామాన్ని లక్షలాది రూపాయలతో అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో మండలంలోని చెరువుపల్లె గ్రామానికి చెందిన వైసిపి నాయకులు పుల్లయ్య, గడ్డంబాషా, సూర్యనారాయణ రెడ్డి, ఆదిరెడ్డి అజయ్ భార్గవ్‌లు ఎమ్మెల్యేకు శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చెరువుపల్లె గ్రామంలో ఇంటింటికి మంచినీరు అందించాలని ఉద్దేశంతో ఓహెచ్ఆర్ఎస్ ట్యాంక్ నిర్మాణం చేపట్టామని, పైప్‌లైన్ పనులు చివరి దశకు చేరుకున్నాయని తెలిపారు. త్వరలోనే పైపులైను కూడా పూర్తి చేసి గ్రామానికి మంచినీరు అందించే కార్యక్రమం చేపడతామని చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను సమానంగా అభివృద్ధి చేయాలన్నదే తమ లక్ష్యమని తెలిపారు.



ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సన్మానిస్తున్న వైసిపి నాయకులు

రెండు బైక్‌లు ఢీకని వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - పాణ్యం

పాణ్యంలోని చెరువుకట్ట వద్ద రెండు బైక్‌లు ఢీ కొన్న సంఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. బుల్లెట్ బైక్‌పై వచ్చిన యువకుడు ఎదురుగా వస్తున్న రామకృష్ణ బైక్‌ను ఢీ కొట్టాడు. దీంతో రామకృష్ణకు, ఆయన మనవరాలికి గాయాలయ్యాయి. ఎస్ఐ అశోక్ మాట్లాడుతూ తాగి బండ్లు నడిపినా, మైనర్లకు బండ్లు ఇచ్చినా చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టిడిపి మండల కన్వీనర్‌కు మాతృవియోగం

ప్రజాశక్తి - బేతంచర్ల

తెలుగుదేశం పార్టీ బేతంచెర్ల మండల కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య మాతృమూర్తి ఉన్నం లక్ష్మీదేవి (79) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న టిడిపి డోన్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి గ్రామానికి చేరుకుని లక్ష్మీదేవి మృతదేహానికి నివాళ్లులర్పించారు. ఎల్ల నాగయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఆయన వెంట నంద్యాల పార్లమెంట్ ఉపాధ్యక్షులు పోలూరు వెంకటేశ్వర రెడ్డి, రాఘవరెడ్డి, షేక్షావలి చౌదరి, టైలర్ రాముడు, శ్రీనివాస్ గౌడ్, వలసల రామకృష్ణ, ఎర్రమల నాయుడు, శ్రీనివాసులు, మధు తదితరులు ఉన్నారు.



నివాళు లర్పిస్తున్న నాయకులు ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి

సర్వేయర్ జగదీష్‌పై చర్యలు తీసుకోవాలి : సిపిఐ

ప్రజాశక్తి - డోన్

భూ సర్వేలో అక్రమాలకు పాల్పడుతున్న డోన్ మండల సర్వేయర్ జగదీష్‌పై చర్యలు తీసుకోవాలని, అధికార పార్టీ నాయకుడికి తొత్తుగా మారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న సర్వేయర్‌పై జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగ నాయుడు అన్నారు. మంగళవారం స్థానిక విలేకరులో ఆయన మాట్లాడుతూ భూములను పక్కాగా సర్వే చేసి వివాదాలు పరిష్కరించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన జగనన్న శాశ్వత భూహక్కు భూరక్షా పథకంలో సర్వేయర్ జగదీష్ కొత్త సమస్యలను సృష్టిస్తున్నారని అన్నారు. డోన్ మండలంలోని అనేక గ్రామాలలో అక్రమాలకు పాల్పడుతూ రైతులను భయాందోళనకు గురి చేస్తున్నారని చెప్పారు. అధికార పార్టీ నాయకుడు చెప్పింది చేస్తున్న సర్వేయర్‌ను వెంటనే విధులను నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. పట్టాభూముల రైతులను సైతం కమీషన్ చెల్లించకుంటే సర్వే నెంబర్ రెడ్ మార్క్ పెడతానని బెదిరిస్తున్నారని తెలిపారు. ఈ సర్వేయర్ శ్రీశైలంకు బదిలీ అయితే మళ్ళీ డోన్‌కు డిప్యూటేషన్ వేసుకున్నారని, ఈ విషయాలపై జిల్లా కలెక్టర్‌కి రాతపూర్వంగా ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సుంకయ్య, కే.రాధాకృష్ణ, మండల కార్యదర్శి ఎస్ పులిశేఖర్, పట్టణ కార్యదర్శి బి.నారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్.రంగ నాయుడు



బోరు వేయిస్తున్న నాయకులు


తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడు మండలం తుమ్మలూరు గ్రామంలోని మైనార్టీ కాలనీలో నెలకొన్న తాగు నీటి సమస్య పరిష్కారానికి వైసిపి మండల అధ్యక్షులు రామలింగేశ్వర రెడ్డి, సర్పంచి వరప్రసాద్ ఆధ్వర్యంలో బోరు వేశారు. ఈ సందర్భంగా రామలింగేశ్వర రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ఎక్కడ తాగునీటి సమస్య తలెత్తకుండా పరిష్కార దిశగా బోరు వేశామన్నారు. గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఐఎంఏ వైస్ చైర్మన్‌గా డాక్టర్ అనిల్ కుమార్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్



ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వైస్ చైర్మన్‌గా నంద్యాల పట్టణ వైద్యుడు అనిల్ కుమార్ నియమితులయ్యారని ఎన్నికల అధికారి డాక్టర్. విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారికి పట్టణ వైద్యులు అభినందనలు తెలిపారు. డాక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ ప్రొఫెషనల్ ప్రొటెక్షన్ వెల్ఫేర్ స్కీమ్‌కు వైస్ చైర్మన్‌గా నియమితులైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన దసరా మహోత్సవాలు

5వ పేజీ తరువాయి.. ఈశాన్య భాగంలో ఉన్న పుష్కరిణీలో వివిధ రకాల విద్యుత్ దీపాల అలంకరణ చేసి, తెప్పకు వివిధ రకాల పూలతో అలంకరించారు. స్వామి అమ్మ వార్లను ఆలయ ప్రాంగణం నుండి పల్లకీలో పుష్కరిణి వద్దకు తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తెప్పోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో, స్థానికులు, అధికారులు పాల్గొన్నారు.

మహానంది : ప్రముఖ శైవక్షేత్రం మహానందిలో దసరా శరన్నవరాత్రి సోమవారం ఘనంగా పూర్ణాహుతితో ముగిశాయి. ముందుగా సిద్ధిధాత్రి దుర్గ అలంకారంలో అమ్మవారు, గజవాహనంపై ఉత్సవం జరిపి అనంతరం పూర్ణాహుతి, కలశ ఉద్వాసన, ఘటప్రదక్షణ, స్వామి అమ్మవార్లకు నవరాత్రి యాగఫలాన్ని సమర్పించడంతో ఉత్సవం ముగిసింది. సాయంత్రం ఈశ్వర్ నగర్‌లోని జమ్మిచెట్టు వద్ద శమీపూజ, గ్రామోత్సవం ఆలయ ఈవో పాలకమండలి చైర్మన్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం దసరా వేషధారణలు చూపరులను ఎంతో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ ఇఒ చంద్రశేఖర్ రెడ్డి, పాలకమండలి చైర్మన్ మహేశ్వర్ రెడ్డి, దాతలు, రుత్వికులు, పండితులు, అర్చకులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. **బనగానపల్లె :** మండలంలోని నందవరం గ్రామంలో దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా విజయదశమి పండగ సందర్భంగా మంగళవారం చౌడేశ్వరి దేవి అమ్మ వారికి, శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి వారికి శమీ పూజ అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ జీవో రామానుజన్ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. **పాణ్యం :** పాణ్యంలో దేవి నవరాత్రులు ఘనంగా ముగిశాయి. చివరి రోజున ఆర్య వైశ్యులు, హైందవ శక్తి సభ్యుల ఆధ్వర్యంలో దుర్గా దేవి నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించాఉ. ఆర్యవైశ్య సభ్యులు నెరవాటి శ్రీను, రమణ కుమార్, బచ్చు కృష్ణమూర్తి, రవి, అనిల్, సతీష్, వెంకటేశ్వర్లు, హైందవ సంఘం సభ్యులు పాల్గొన్నారు. **అవుకు :** పట్టణంలోని అమ్మవారి శాలలో దసరా శరన్నవరాత్రుల వేడుకలు మంగళవారం పవళింపు సేవతో ముగిశాయి. ఆర్యవైశ్య అధ్యక్షులు మేడం ఆంజనేయులు, యువజన అధ్యక్షులు తాలేపల్లి నాగేంద్ర కుమార్‌ల ఆధ్వర్యంలో నవరాత్రులు వేడుకలు అంగరంగ వైభవంగా ముగిశాయి. ఆర్యవైశ్యులు తళ్ళం నాగ భూషణం, మేడం సతీష్ కుమార్, సన్నితి శ్రీనివాసులు, జీవి సుబ్రహ్మణ్యం, మహిళలు పాల్గొన్నారు.



శ్రీశైలంలో గ్రామోత్సవ దృశ్యం



చౌడేశ్వరి దేవస్థానంలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

గెలుపోటములను సమానంగా భావించాలి

- కాటసాని ఓబుల్ రెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

క్రీడాకారులు గెలుపోటములను సమానంగా భావించాలని వైసిపి యువ నాయకులు, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కుమారుడు కాటసాని ఓబుల్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని పెండేకంటి వెంకటసుబ్బయ్య ఇండోర్ స్టేడియంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించిన దివంగత కాటసాని నాగార్జున రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ షటిల్ టోర్నమెంట్ రెండు రోజుల పోటీలు ముగిశాయి. గెలుపొందిన క్రీడాకారులకు వైసిపి యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డి బహుమతులను అందజేశారు. జనరల్ కేటగిరి, 40 ప్లస్ క్యాటగిరిలో పోటీలు నిర్వహించారు. మొదటి రోజు పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. రెండవ రోజు కాటసాని ఓబుల్ రెడ్డి పాల్గొని క్రీడాకారులకు బహుమతులను అందజేసి మాట్లాడారు. దివంగత కాటసాని నాగార్జున రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా క్రీడా పోటీలను, మరెన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి యువ నాయకులు కాటసాని గణేష్ రెడ్డి, ఉమ్మడి శ్రీకాంత్ రెడ్డి, కాటసాని రామచంద్ర రెడ్డి, కోడూరు రవిరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు భుజంగరావు, వెంకటేశ్వర్లు, హరి, శేఖర్, డాక్టర్ రవి కుమార్, బీసీ సంఘం నాయకులు శ్రీరాములు, క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు బహుమతుల అందజేస్తున్న కాటసాని ఓబుల్ రెడ్డి

ఘనంగా విజయదశమి వేడుకలు

- నందవరం దేవస్థానంలో ఎమ్మెల్యే కాటసాని సతీమణి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని నందవరం చౌడేశ్వరి దేవి దేవస్థానంలో విజయదశమి పండగను పురస్కరించుకొని భక్తులు వేలాదిగా తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సతీమణి కాటసాని జయమ్మ, కోడలు కాటసాని మేధాశ్రీ రెడ్డి, కూతురు భూమా ప్రతిభా, కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి మూల విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాటసాని జయమ్మ మాట్లాడుతూ దసరా చెడు మీద మంచి సాధించిన విజయానికి గుర్తుగా ఈ పండుగను విజయదశమి అని పిలుస్తారని, దీనిని పది రోజుల పాటు జరుపుకుంటారని తెలిపారు. **పగిడ్యాల :** మండలంలో విజయదశమి పండగను సోమవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని నెహ్రూనగర్, పాత ముచ్చుమర్రి, కొత్త ముచ్చుమర్రి, వనుములపాడు, ఆంజనేయ నగర్, బీరవోలు, సంకిరేణి పల్లె, పగిడ్యాల, పాలమర్రి, లక్ష్మాపురం, ప్రాతకోట, ఎం.ఘణపురం, ఎన్.ఘణపురం గ్రామాలలో విజయదశమి పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోని అమ్మవారి ఆలయాలలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం జమ్మిచెట్టు వద్దకు వెళ్లి జమ్మి ఆకు తెచ్చి పెద్దలకు ఇచ్చి పాదాలకు నమస్కరించారు. **బండి ఆత్మకూర్ :** మండలంలోని సంత జూటూరు గ్రామంలో దసరా పండగను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. సోమవారం ఆలయ ధర్మకర్త భూమా జయరామరెడ్డి ఆధ్వర్యంలో పురాతన కాలం నాటి సీతా రాముల ఉత్సవ విగ్రహాలను తీసుకొని జమ్మి చెట్టు చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ పురోహితుడు పూజలు నిర్వహించారు. జమ్మి ఆకును పెద్దలకు ఇచ్చి ఆశ్వీరాదాలు తీసుకున్నారు. అనంతరం పాలపిట్టను చూసేందుకు పిల్లలంతా పరుగు పెట్టార. అనంతరం ఉత్సవ విగ్రహాలను గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు కొంగిస పెద్ద లింగమయ్య, రిటైర్డ్ ఉపాధ్యాయుడు చెన్నయ్య, ప్రభాకర్ రెడ్డి, వెలగల తిరుపాలు, పలచాని మహేశ్వర్ రెడ్డి, కొంగ శంకర్, భూమా రఘునాథరెడ్డి, ఉమ్మడి శ్రీనివాసరెడ్డి బారెడ్డి, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **కొత్తపల్లి :** కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా దసరా వేడుకలు జరిగాయి. ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం జమ్మి చెట్టు వద్దకు వెళ్లి పూజలు చేశారు. **ఆళ్లగడ్డ :** పట్టణంలోని విశ్వరూప పారిశ్రామిక నగర్లో వెలసిన కాళికామాత ఆలయంలో మంగళవారం విజయదశమి వేడుకలు ఘనంగా జరిగాయి. కాళికామాత ఆలయ కమిటీ అధ్యక్షులు, ప్రముఖ శిల్పి దురుగడ్డ రవీంద్రచారి ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. విశ్వబ్రాహ్మణ కమిటీ సభ్యులందరూ ఉభయ దారులుగా వ్యవహరించి అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్, శిల్పి దురుగడ్డ రవీంద్రచారిని ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. సాయంత్రం ఉత్సవమూర్తి కాళికామాత అమ్మవారిని పట్టణంలోని రామలక్ష్మి కొట్టాల సమీపంలో పెద్దమ్మ గుడి వద్ద ఉన్న శమీ వృక్షము వద్దకు మేళ తాళాల సందడిల మధ్య ఊరేగింపుగా అమ్మవారిని తీసుకెళ్లారు.

అమ్మవారిని దర్శించుకున్న భూమా జగన్ విఖ్యాత్ రెడ్డి

నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని కాళికామాత అమ్మవారిని టిడిపి యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో జగత్ విఖ్యాత్ రెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.



బనగానపల్లె : ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సతీమణి జయమ్మ



బండి ఆత్మకూరు : సంత జుటూరు గ్రామంలో దసరా సందర్భంగా శమీ వృక్షం దగ్గర పూజలు చేస్తున్న దృశ్యం



పగిడ్యాల : జమ్మికి వెళ్తున్న గ్రామ ప్రజలు

